# వికాలాంగుల సేవకోసం TAGB ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రుల ఘంటసాల కార్యక్రమం

అమర గాయకుడు ఘంటసాల స్మృతిని సాంఘిక సేవా దృక్పథంతో రంగరించి అమెరికాలోని బోస్టన్ పరిసర ప్రాంతాల తెలుగు సంఘం (TAGB) వారు ఆహ్లాదకరమైన సంగీత కార్యక్రమాన్ని డిశంబర్ 1, 2007 నాడు అందించారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి వచ్చిన ప్రఖ్యాత గాయకులు శ్రీ జి.వి.ప్రభాకర్, అమెరికాలో పేరెన్నికగన్న గాయని శ్రీమతి మణి శాస్త్రి గార్లు ప్రధాన కళకారులుగా హైదరబాద్ 'వేగేశ్న ఫౌండేషన్ ' వారి సహకారంతో TAGB వారు అందించిన ఈ కార్యక్రమం దాదాపు నాలుగువందల మంది ఘంటసాల అభిమానులని మనసారా ఆహ్లాదపరచడమే కాకుండా, 'వేగేశ్న ఫౌండేషన్ ' వారికి 14,000 డాలర్లకి పైగా విరాళ నిధులు సమకూర్చింది. సంఘం అధ్యక్షులు శ్రీ శ్రీనివాస్ కాకి తమ ఆహ్వాన ప్రసంగంలో, సాంస్కృతిక కార్యకలాపాలే కాకుండ TAGB వంటి సంస్థ సాంఘిక సేవా కార్యక్రమాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గోవాలి అన్న ఉద్దేశ్యంతో వేగేశ్న సంస్థకి ఈ కార్యక్రమం ద్వారా సహకరం అందించడానికి అవకాశం లభించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఘంటసాల గారి 85అ జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమం జరగడం మరింత విశేషం అనీ, వేగేశ్న సంస్థ వారు వికాలాంగులైన పిల్లలకి చేస్తున్న సేవ చాలా విశిష్టమైనదని తెలియచేశారు. బోస్టన్ నగరంలోని ప్రఖ్యాత వైద్యులు డా. నాగగోపాల్ వెన్న, శ్రీమతి ఉష గార్లు దీపం వెలిగించడంతో కార్యక్రమం మొదలయింది.

సంగీత కార్యక్రమాన్ని ఆరంభిస్తూ శ్రీ మధు చారి గారు ఘంటసాల గాత్రంలోని మరచిపోని తీయదనాన్ని, అమరత్వాని ప్రేక్షకులకి గుర్తుచేశారు. DVD ద్వారా అమర గాయకుని జీవితం గురించి, సంగీత వైశిష్ట్యం గురించిన పరిచయం చాలా బాగుంది. శ్రీ ప్రభాకర్, శ్రీమతి

మణి శాస్త్రి గార్లు ప్రేక్షకులని కార్యక్రమంలో భాగంపంచుకోమని అహ్వానించడం, ప్రేక్షకులు కోరిన పాటలని ట్రాకులు లేకపోయినా పాడి వినిపించడం, సందర్భోచితమైన హాస్యంతో అందరినీ నవ్వించడం, ప్రేక్షకులని బాగా ఆకట్టుకున్నాయి. మధురమైన పాత తెలుగు సినిమా పాటలు, ముఖ్యంగా ప్రభాకర్ గారు పాడిన 'రసికరాజ తగువారము కాదా ' గీతం, 'కరుణశ్రీ' గారి పుష్పవిలాపం వంటివి ప్రేక్షకులని విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే శ్రీమతి మణిశాస్త్రి గారి 'మీరజాలగలడా ' , 'మనసే అందాల బృందావనం ' గీతాలు అద్భుతమైన మాధుర్యంతో అందరి హృదయాలకి హత్తుకుపోయాయి. అసలైన ఘంటసాల గీతాలనే మరిపించేటట్టుగా ఈ ఇద్దరు కళాకారుల నైపుణ్యం భాసిల్లిందనడం అతిశయోక్తికాదు. బోస్టన్ ప్రాంతీయ కళాకారులు అనేకమంది వీరిద్దరికీ తీసిపోనట్టుగా తమ ప్రతిభని ప్రదర్శించి ఉత్కృష్టమైన ఘంటసాల గీతాలతో కార్యక్రమాన్ని రక్తి కట్టించారు.

హైదరబాదులో 'వేగేశ్న ఫౌండేషన్ ' వారు వికాలాంగులకి విద్య వైద్య సదుపాయల విషయంలో చేస్తున్న విశేషమైన సేవల గురించి జరిగిన DVD ప్రదర్శన అందరి మనసులని ఆర్ద్రతతో నింపింది. వేగేశ్న సంస్థ అధ్యక్షులు శ్రీ వంశీ రామరాజు గారు, ముఖ్య కార్యకర్త శ్రీ వంగూరి చిట్టెన్ రాజు గారు సంస్థకి సహాయపడటానికి ప్రవాసంధ్రులు స్వచ్ఛందంగా ముందుకి రావాలని, అనేక విషయాలలో సంస్థకి సహాయం అవసరమనీ తెలియజేసారు. $250 విరాళంతో వికలాంగులైన ఒక బాలుడికి లేక బాలికకి మంచి భవిష్యత్తు చూపించడం వీలవుతిందని, ఇప్పుడు అక్కడ 400 మంది వికాలాంగ బాలురు వున్నారని, వారికి వైద్య సదుపాయలకి నిధుల అవసరం ఎంతైనా వుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు $14,000 విరాళాలు సేకరించగలిగామని చెప్పారు.

చివరిగా కళాకారులు శ్రీ ప్రభాకర్, శ్రీమతి మణి శాస్త్రి గార్లకీ, శ్రీ వంశీ రామరాజు గారికి, శ్రీ చిట్టెన్ రాజు గారికి బోస్టన్ ప్రాంత తెలుగు ప్రముఖులు గ్నాపికలు అందించారు. వందన సమర్పణ చెపుతూ ఉపాధ్యక్షులు డా. సూర్య జయంతి గారు పిచ్చేసిన కళాకారులకీ, అతిథులకీ, ప్రేక్షకులకీ, అనేక పిధాలుగా తోడ్పడిన TAGB యువత కార్యకర్తలకి, కార్యక్రమానికి పాక్షిక దాతలు శ్రీ మూర్తి మరియు పద్మ పరకాల గార్లకు సంఘం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.